క్లుప్తంగా

మెండోరా పోలీస్ స్టేషన్ తనిఖీ



బాల్కొండ: మెండోరా పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్)జయరాం తనిఖీ చేశారు. ఠాణా పరిధిలోని క్రైమ్ రేటు వివరాలను సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండ చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్, ఎస్సైలు శ్రీనివాస్, భాస్కరా చారీ, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ రోటరీ సభ్యులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యదర్శి కోశాధికారి లక్ష్మీనారాయణ, సభ్యులు గోనె దామోదర్, ఖాందేశ్ సత్యం, రాజన్న, శశిధర్, రాస ఆనంద్, వినాయక్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్



బోధన్‌టౌన్(బోధన్): ప్రతీ ఆదివారం 10 గంటల, 10 నిమిషాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ అధికారులు పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని మురికి కాలువల్లో, వర్షపు నీరు నిలిచిన ప్రదేశాల్లో దొమల మందు పిచికారితో పాటు బ్లీచింగ్ చేశారు. సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాల్‌మెంట్ అధికారి దేవేంధర్, వార్డుల జవాన్‌లు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

వైభవంగా తీజ్ వేడుకలు



నవీపేట: మండలంలోని స్టేషన్ ఏరియాలో బంజార సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గిరిజనులు తీజ్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా పాల్గొన్నారు. బంజారా యువతులతో కలిసి నృత్యం చేశారు. అంతకుముందు నాగేపూర్ చర్చిలో ఫాతిమా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అన్యాయం



నవీపేట: సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం చేశారని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏఎస్ పోశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తమకు ఎలాంటి గుర్తింపునివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం ఎదురవుతుందన్నారు. నాయకులు సాయికుమార్, అశోక్, భూంరెడ్డి పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



బోధన్: సాలూర మండల కేంద్రంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించి వేశారని, వెంటనే నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అంతకు ముందు వారు మండల కేంద్రంలో నిరసన తెలిపారు. నాయకులు మందర్న రవి, నాయకులు అల్లె రమేష్, అశోక్, రవీందర్‌రెడ్డి, రమేష్, దేవురావు, ప్రకాష్, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనంపై పట్టింపేది?

- ఎస్సారెస్పీ వద్ద ఏళ్ల క్రితం డ్యాం సైట్ ఆస్పత్రి నిర్మాణం
- ప్రస్తుతం వృథాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన డ్యాం సైట్ ఆస్పత్రి భవనం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీ ప్రజలు, ఉద్యోగులు, సిబ్బంది కోసం ప్రాజెక్ట్ నిర్మాణం అనంతరం డ్యాం సైట్ ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. అప్పట్లో ఈ ఆస్పత్రిలో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవాలు అందించేవారు. కాలక్రమేణా డ్యాం సైట్ ఆస్పత్రి కాస్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మారింది. 2013లో పీహెచ్‌సీకి నూతన భవనాన్ని నిర్మించారు. దీంతో డ్యాం సైట్ ఆస్పత్రిని ఖాళీ చేయడంతో ఈ భవనం నిరూపయోగంగా మారింది. అప్పటి నుంచి ఆస్పత్రిని పట్టించుకునే వారులేక పరిసరాలు అధ్వానంగా మారడంతోపాటు, భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది.

మరమ్మతులు చేయిస్తే ప్రయోజనం..

డ్యాం సైట్ ఆస్పత్రి భవనంలో 24 గదులు ఉన్నాయి. చుట్టురుగా కళాశాలకు, పాఠశాలకు వినియోగించేలా భవన నిర్మాణం ఉంది. ఈ భవనానికి స్వల్ప మరమ్మతులు చేయించి పాఠశాల, కళాశాలకు అప్పగిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ పాలకులు ఇప్పటి వరకు ఆ వైపుగా ఆలోచన చేయలేదు. ఫలితంగా భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని దంగు సున్నాంతో నిర్మించారు. ఇప్పటికీ ఎక్కడ కూడ గోడలు నెర్రెలు పడిన దాఖాలాలు లేవు. కోతుల బెడద వలన అక్కడక్కడ మట్టి పెంకులు మాత్రమే రాలిపోయాయి. స్వల్పంగా మరమ్మతులు చేపడితే నూతన భవనాన్ని తలపిస్తుంది. ఈ ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనం గోడలు నెర్రెలు పడటంతో ప్రస్తుతం ఆ భవనానికి మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో తాత్కలికంగా పీహెచ్‌సీ వైద్యులు వైద్య సేవలను డ్యాం సైట్ ఆస్పత్రిలోనే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డ్యాం సైట్ ఆస్పత్రి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పరిశీలనలో ఉంది..

ప్రాజెక్ట్ కాలనీలోని డ్యాం సైట్ ఆస్పత్రి భవనం ఉపయోగంలోకి తీసుకురావాడానికి ఉన్నత అధికారుల పరిశీలనలో ఉంది. ఏదైన ప్రభుత్వ సంస్థకు అప్పగించాలని ఆలోచన చేస్తున్నారు. త్వరలోనే ఉపయోగంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.

– అక్తర్, ఏఈఈ, ఎస్సారెస్పీ

కొనసాగుతున్న రైతుల రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

రెంజల్(బోధన్): రోడ్ల కోసం మండల కేంద్రంలో స్థానిక రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 40వ రోజు కొనసాగాయి. దీక్షలకు గ్రామంలోని అన్ని వర్గాల మద్దతు లభిస్తుంది. గాండ్ల సంఘం ప్రతినిధులు దీక్షలకు మద్దతు ప్రకటించి రైతులకు సంఘీభావం తెలిపారు. పాలకులు పట్టించుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.

నేడు రెంజల్ బంద్‌కు పిలుపు..

రెంజల్ రైతు సంఘం అధ్వర్యంలో సోమవారం రెంజల్ బంద్‌కు పిలునిచ్చారు. రైతుల రిలే నిరాహార దీక్షలను పాలకులు పట్టించుకోకపోవడంతోపాటు, రోడ్లను నిర్మించకపోవడంతో రెంజల్ బంద్‌కు పిలుపునిచ్చామని వారు తెలిపారు. ప్రతినిధులు చుక్క రాజుగౌడ్, బుజ్జి, కటికెల శ్రీనివాస్, కొండల్‌వాడీ శ్రీనివాస్, లోలపు ఒడ్డెన్న ఉన్నారు.

నిజాం షుగర్స్ కార్మికులను ఆదుకోవాలి



బోధన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

బోధన్: మూతపడిన నిజాం దక్కన్ షుగర్స్‌లిమిటెడ్ (ఎన్డీఎస్ఎల్) కార్మికులకు బకాయి వేతనాలు ఇప్పించి, ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ లేఆఫ్ కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులు బతుకుదెరువు లేక దుర్భర బతుకులు వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఫ్యాక్టరీ ప్రైవేట్ యాజమాన్యం బకాయి వేతనాలు, ఫ్యాక్టరీ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. కార్మిక నాయకులు నాగరాజు, అన్వర్ మియా, రఘునాథ్, నాగేశ్వర్‌రావు, రహమత్ అలీ, శ్రీధర్, శ్రీను, బాలకృష్ణ, బిక్షపతి, లింగం గౌడ్, వికారుద్దీన్, విద్యాసాగర్, బషీర్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



దళితరత్న అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోధన్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, జిల్లా అధ్యక్షుడు మోహన్ డిమాండ్ చేశారు. కొత్త పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు ఖరారు చేయాలని కోరారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం పట్టణ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్గీకరణ సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. అనంతరం దళిత రత్న అవార్డు గ్రహీతలను సన్మానించారు. నాయకులు డప్పు చంద్రయ్య, లత, నాగయ్య, సుధాకర్, భూమయ్య, పోశెట్టి, జ్ఞానేశ్వర్, సాయిలు, రాఘవరావు, రవి ఉన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారులకు చేయూత



క్రీడాకారులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఆర్మూర్: ఆర్మూర్ నుంచి అంతర్జాతీయ స్థాయి రెజ్లింగ్ (కుస్తీ) క్రీడకు ఎంపికైన డాకూరి భాను ప్రసాద్, ఓర్స్ మహేష్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వారు అండగా నిలిచారు. రెజ్లింగ్ క్రీడలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మిత్రులు భాను ప్రసాద్, మహేష్‌పై 'చేయూతనందించరూ' అనే శీర్షికతో గత నెల 6న 'సాక్షి' దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పలువురు దాతలు పేద విద్యార్థులకు అండగా నిలిచారు. అందులో భాగంగా క్రీడాకారులిద్దరికి రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు పట్వారి పపికృష్ణ ఆదివారం రూ.13 వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో వీరు పోటీ పడాల్సి ఉంది. పట్వారి తులసి, లక్ష్మీనారాయణ, గోనె దామోదర్, ఖాందేశ్ సత్యం, రాజన్న, శశిధర్, రాస అనంద్, వినాయక్, సూర్య ప్రకాష్, సుధ పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచారం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం పాంగ్రా, మహాలక్ష్మీనగర్ కాలనీలలో ఆదివారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం పార్టీ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ ఇన్‌చార్జి భూపతిరెడ్డి కాలనీలలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రుద్రూర్: జీపీ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి, పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. కోటగిరిలో జీపీ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆదివారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వారిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. నాయకులు దుబాస్ రాములు, ఓమయ్య, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

ధ్యానం చాలా గొప్పది



ఆర్మూర్‌టౌన్: అన్నిటి కన్నా ధ్యానం చాలా గొప్పదని ప్రతిఒక్కరూ నిత్యం ధ్యానం చేయాలని పీస్ ఆఫ్ మైండ్ స్వామి అన్నారు. పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై శ్రీ నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం వద్ద ఆదివారం హ్యాపీ సండే ధ్యాన ఆత్మ జ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం చేసే వారు తక్కువగా మాట్లాడాలని, ఎక్కువగా వినాలన్నారు. . సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ నీలిమ, పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ సభ్యులు సాయి కృష్ణారెడ్డి, తిరుమల గంగారాం, నర్సయ్య, నారాయణ, రాజారాం, మాస్టర్లు బొడ్డు దయానంద్, సాయిబాబా, చిదుర రాజు, ధ్యానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన

బోధన్: సాలూర మండలంలోని మందర్న గ్రామంలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న ప్రభుత్వ స్థలాన్ని ఆదివారం బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ మమత, ఎంఆర్ఐ గంగాధర్, సర్వేయర్‌లు పరిశీలించారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో చాల సార్లు వినతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇళ్ల పట్టాల జారీ కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించినట్లు స్థానికులు తెలిపారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.





నందిపేటలో నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. ఆర్మూర్‌లో జాగృతి ఆధ్వర్యంలో..

ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళి



బాల్కొండ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

నందిపేట్/ఆర్మూర్‌టౌన్/బాల్కొండ/కమ్మర్‌పల్లి/వేల్పూర్: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా మండల కేంద్రాలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, భారత జాగృతి ప్రతినిధులు ఆదివారం జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. జయశంకర్ సార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీ జెన్‌కో కార్యాలయంలో..



ముప్కాల్ పోలీస్ స్టేషన్‌లో..

విప్లవ గేయాల గుండె చప్పుడు గద్దర్



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆర్మూర్‌టౌన్: ప్రజా గాయకుడు గద్దర్ విప్లవ గేయాల గుండె చప్పుడు అని సీపీఐఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్‌లో ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో గద్దర్‌కు సీపీఐ ఎంఎల్ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. గద్దర్ స్ఫూర్తితో కళాకారులు ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేయాలన్నారు. నాయకులు దేవారాం, రామకృష్ణ, గంగాధర్, గోదావరి, ఆజాద్, ముత్తెన్న, సురేష్ పాల్గొన్నారు.

అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరపాలి

కమ్మర్‌పల్లి: మలి దశ తెలంగాణ ఉద్యమంలో అహర్నిశలు శ్రమించిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మృతికి సంతాపంగా సోమవారం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి తరలిరావాలి





ఆర్మూర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘ సభ్యులు.. నవీపేటలో..



కోటార్మూర్‌లో..

పెర్కిట్/ఆర్మూర్‌టౌన్/నవీపేట: జగిత్యాల జిల్లా కోరుట్లలో ఈ నెల 13న నిర్వహించే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి కార్యక్రమానికి పద్మశాలీలు తరలి రావాలని సంఘ ప్రతినిధులు కోరారు. ఈమేరకు ఆర్మూర్, కోటార్మూర్, నవీపేట్ సహా పలు మండలాల్లో ఆదివారం కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆయా మండలాల పద్మశాలి సంఘ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పద్మశాలీల సంఘటితం, అధికారం, సమానత్వం, రాజ్యాధికార సాధన కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

అడవి పందుల దాడిలో మక్కపంట ధ్వంసం



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో మక్క చేనుల్లో అడవి పందులు దాడిచేసి, పంటను ధ్వంసం చేశాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలను నష్టపోయి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రెంజర్లలో ధ్వంసమైన మక్క పంట

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మాక్లూర్: మండలంలోని రెండు గ్రామాలను పంచాయతీలుగా మార్చినందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం ఆయా గ్రామాల ప్రజలు క్షీరాభిషేకం చేశారు. మండలంలోని మెట్టు గ్రామం, రామస్వామి క్యాంప్‌లను జీపీలుగా మారుస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – బ్రో(తెలుగు)2డీ-11.00, 1.55 4.50,7.45, 10.40

స్క్రీన్-2 – మెగ్(తెలుగు) - 10.45, 1.25, 7.20, 10.00 ఎల్‌జీఎమ్(తెలుగు)- 4.05

స్క్రీన్-3 – రాఖీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ - 10.05, 7.00,10.35, మిస్టేక్ 4.35

స్క్రీన్-4 – బేబి(తెలుగు) -11.10, 6.30, ఓపెన్ హైమర్(ఇంగ్లీష్) 2.40, ఎల్‌జీఎం 10.00

సంక్షిప్తం

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నేషనల్ సర్వీసెస్ స్కీమ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'సామాజిక ఆర్థిక అసమానతలు, జాతీయ విద్యా విధానం 2020' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వీటిని జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ సెల్‌కు పంపనున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. సిబ్బంది దేవేందర్, ఆర్కే పాండే, శివరాజ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుకాలనీలో శ్రమదానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛకాలనీ, సమైక్య కాలనీలో భాగంగా కాలనీవాసులు శ్రమదానం చేశారు. కాలనీలో పెరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్, శివరాజ్, కమలాకర్, సత్యనారాయణగౌడ్, కొంతంరాజు, ఎల్‌టీ కుమార్ పాల్గొన్నారు.

ఎత్తోండ వాసికి జ్యోతిష్య వైభవ రత్న అవార్డు



రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తోండ గ్రామ వాసి, మఠం దీపక్ స్వామికి జ్యోతిష్య వైభవ రత్న అవార్డు లభించింది. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో లలిత కళా సమాఖ్య ఆధ్యాత్మికపీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ ప్రముఖుడు ప్రదీప్ ఆయనకు అవార్డు అందజేశారు.

ఆర్డీవోకు సన్మానం



బోధన్: సాలూర మండల కేంద్రానికి వచ్చిన బోధన్ ఆర్డీవో రాజాగౌడ్‌ను ఆదివారం స్థానిక, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ మమత, నాయకులు రమేష్, రవి పాల్గొన్నారు.